

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

# పనిచేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి

- ఉమ్మడి జిల్లా సమీక్షలో మంత్రి సీతక్క ఆగ్రహం
- సమగ్రాభివృద్ధికి కృషి చేద్దాం
- అధికారుల పనితీరుపై ఎమ్మెల్యేల అసహనం

హనుమకొండ, ఏప్రిల్ 12 : ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పనులు చేయకుండా పెండింగ్ పెట్టిన కాంట్రాక్టర్ల తీరుపై రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిని బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. ఈమేరకు శనివారం సాయంత్రం హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, మహిళా, శిశు సంక్షేమ శాఖలపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాను ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో సమగ్ర అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. పనిచేసే కాంట్రాక్టర్లకే డబ్బులు ఇస్తామన్నారు. కాంట్రాక్టర్లకు గడువు పెట్టి రోడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. హైదరాబాద్ తర్వాత రెండో పెద్ద నగరమైన వరంగల్‌ను అభివృద్ధి చేసుకోవడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేద్దామన్నారు. ఎస్సీ డెవలప్‌మెంట్ కింద ఇచ్చిన సీసీ రోడ్లను అధికారులు పూర్తి చేయాలని బిల్లులను చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. వారం రోజుల్లో టెండర్లు పూర్తిచేసి ప్రారంభించాలని పనులు నాణ్యంగా ఉంటేనే బిల్లులు చెల్లిస్తామని స్పష్టంచేశారు. అన్నిచోట్ల రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. బాగా పనిచేసిన కాంట్రాక్టర్లకు మిగతా చోట్ల పనులు అప్పగిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేస్తూ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇందిరా మహిళా శక్తి భవనాలు పూర్తికానిచోట్ల పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య తక్కువ ఉన్న చోట సమీప ప్రభుత్వ పాఠశాల ఆవరణకు తరలించే ఏర్పాట్లు చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి అనితా రామచంద్రన్‌కు సూచించారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్స్, తదితర సౌకర్యాలను సమకూర్చేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న సీసీరోడ్లు, ప్రభుత్వ భవనాలు, వంతెనలు తదితర అభివృద్ధి పనులతో పాటు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా పెండింగ్ పనుల విషయంలో పలుమార్లు చెప్పినప్పటికీ కాంట్రాక్టర్లు, అధికారులు వినడం లేదని మంత్రి ఎదుట అధికార పార్టీ ఎమ్మెల్యేలే అసహనం వ్యక్తం చేయడం గమనార్హం. సమావేశంలో వరంగల్, మహబూబాబాద్ ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, చీఫ్ విప్ రామచంద్రునాయక్, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనితా రామచంద్రన్, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, పంచాయతీరాజ్ ఈఎన్సీ కనకరత్నం, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా ఉమ్మడి జిల్లా సమీక్షకు ఆరు జిల్లాల కలెక్టర్లు హాజరుకావాల్సి ఉండగా హనుమకొండ కలెక్టర్ మినహా ఎవరూ రాలేదు.

## సీతక్క వర్సెస్ ఎమ్మెల్యేలు

- సమీక్ష సమావేశానికి డుమ్మా
- మీటింగ్‌కు దూరంగా నలుగురు ఎమ్మెల్యేలు
- అదే దారిలో మరో మంత్రి సురేఖ

వరంగల్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పంచాయతీరాజ్ మంత్రి సీతక్కపై వరంగల్ జిల్లాలోని మెజార్టీ ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇన్ని రోజులుగా అంతర్గతంగా ఉన్న అసంతృప్తిని ఇప్పుడు బహిరంగంగా వ్యక్తం చేశారు. అంతేగాక ఉమ్మడి జిల్లాలోని మరో మంత్రి కొండా సురేఖతో మొదటినుంచీ ఉన్న విభేదాలు ఇంకా కొనసాగుతున్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మిషన్ భగీరథ, మహిళా–శిశు సంక్షేమ శాఖలపై మంత్రి సీతక్క శనివారం హనుమకొండ కలెక్టరేట్ లో ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించగా మంత్రి సురేఖ సహా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి హాజరు కాలేదు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సీతక్క తన సొంత శాఖపై ఉమ్మడి జిల్లాలోని పనులపై నిర్వహించిన సమావేశానికి అధికార పార్టీకి చెందిన మరో మంత్రి, నలుగురు ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడంపై తీవ్ర చర్చ జరుగుతున్నది. సమావేశానికి హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా అభివృద్ధి పనులు, నిధుల విడుదలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా కొత్తగా పనులు చేపట్టడంలేదని అధికార పార్టీ మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, రామచంద్రూనాయక్, గండ్ర సత్యనారాయణరావు, కె.ఆర్.నాగరాజు అన్నారు. గ్రామాల్లోని రోడ్లపై కంకర వేసి అలాగే ఉంటున్నాయని, డాంబర్ వేయాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అసంతృప్తి వ్యక్తం చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలు తన శాఖ పనితీరుపై వాస్తవాలు చెప్పడంతో మంత్రి సీతక్క సమీక్షలో ఇబ్బందిపడినట్లు కనిపించారు.

## ఇక్కడ రాజకీయాలు మాట్లాడదలుచుకోలేదు

**ఎమ్మెల్యే పల్లా**



బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అన్ని నియోజకవర్గాలకు నిష్పక్షపాతంగా నిధులు కేటాయించామని, ఇప్పుడు కూడా అలాగే ఇవ్వాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంత్రి సీతక్కకు సూచన చేశారు. ఈ క్రమంలో ఎంపీ బలరాంనాయక్ కల్పించుకొని బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు కడుతున్నాం అనడంతో పల్లా జోక్యం చేసుకొని సమీక్షా సమావేశంలో రాజకీయాలు మాట్లాడదలుచుకోలేదని, బయటకు వస్తే మాట్లాడుతానని సమాధానమిచ్చారు. కాగా ఎంపీ కల్పించుకొని మాట్లాడడంపై పలువురు చర్చించుకున్నారు.

# ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

- అందుకే స్థానిక ఎన్నికలకు ముందుకు రావడంలేదు
- అబద్ధాలతో కాలంవెళ్లదీస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మడికొండ: వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట/మడికొండ, ఏప్రిల్ 12 : కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రస్థాయిలో వ్యతిరేక ఉందని, అందువల్లనే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుకు రావడం లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అనేక అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, వారి రెండేళ్ల పాలన పూర్తికాకముందే ప్రజలు ప్రభుత్వ వైఫల్యాలను గుర్తిస్తున్నారన్నారు. శనివారం వర్ధన్నపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో ఎర్రబెల్లి పాల్గొన్నారు. అలాగే మడికొండలో జరిగిన గ్రేటర్ వరంగల్ 46, 64వ డివిజన్ ముఖ్యనాయకుల సమావేశానికి హాజరై రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్నాడని, సొంతపార్టీకి చెందిన 32 మంది ఎమ్మెల్యేలు ఆయనకు వ్యతిరేకంగా ఉన్నారన్నారు. రేవంత్ ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను గుర్తించి కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి రాలేకపోతున్నదన్నారు. ఆ పార్టీ వచ్చే శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో 10 ఎమ్మెల్యే సీట్లకంటే ఎక్కువ గెలవదని ఓ సర్వేలో తేలిందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఆ పార్టీకి ఘోర పరాభవం తప్పదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమవుతున్నదన్నారు. ఉద్యమనేత కేసీఆర్ సీఎంగా బాధ్యతలు తీసుకున్న తరువాత గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించడంతో రాష్ట్రం సస్యశ్యామలమైందన్నారు. నీరు సమృద్ధిగా రావడంతో కొన్ని ప్రాంతాల రైతులు సరఫరాను నిలిపివేయాలని కోరారనానరు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సారెస్పీ కాలువతో పాటు వాగులన్నీ ఎడారిగా మారాయన్నారు. రైతులు యాసంగి పంట కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని ఎర్రబెల్లి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పోలీసుల వత్తిడి, అధికార పార్టీ నేతల మాటలకు భయపడకుండా పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. రజతోత్సవ సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. సమావేశాల్లో జిల్లా మహిళా నాయకురాలు ఎల్లావుల లలితాయాదవ్, మాజీ ఎంపీపీలు అన్నమనేని అప్పారావు, నూనె భిక్షపతి, మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి, నాయకులు అల్లం శ్రీనివాసరావు, పోలెపల్లి రాంమూర్తి, రాంగోపాల్‌రావు, విజయ్‌కుమార్, గుజ్జ గోపాల్‌రావు, గుజ్జ సంపత్‌రెడ్డి, చొప్పరి సోమయ్య, సిలువేరు కుమారస్వామి, తుమ్మల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్ పక్కన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, నన్నపునేని నరేందర్, నాయకులు

# కేసీఆర్‌ను విమర్శించే స్థాయా నీది?

- అడ్డిమార్ గుడ్డిదెబ్బల ఎమ్మెల్యే అయినవ్
- పెద్దోళ్లను తిడితే పెద్దోడివైపోవు..
- ప్రపంచమే అబ్బురపడేలా సభలు నిర్వహించినం
- మా జోలికొస్తే ఊరుకునేది లేదు
- నాయినిపై బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఫైర్

హనుమకొండ, ఏప్రిల్ 12 : 'కేసీఆర్‌ను విమర్శించే స్థాయా నీది? అడ్డిమార్ గుడ్డి దెబ్బల ఎమ్మెల్యేగా గెలిచినవ్. నువ్వు కేసీఆర్ కాలిగోటికి కూడా సరిపోవు. గింత ఉన్నోనివి.. స్థాయి మరిచి మాట్లాడుతున్నవ్.. పెద్దోళ్లను తిడితే పెద్దోడివైపోతామనుకుంటున్నవ్.. అలాంటి నాయకుల్లో నువ్వు ఫస్ట్ ఉంటవ్' అంటూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మండిపడ్డారు. శనివారం సాయంత్రం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, నన్నపునేని నరేందర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. 'అరవై ఏండ్ల తెలంగాణ ప్రజల కలను సాకారం చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్.. సూర్యుడిలాంటి ఆయనపై విమర్శలు చేయడం అంటే సూర్యుడి మీద ఉమ్మి వేసినట్టేనన్నారు. కేసీఆర్, రజతోత్సవ సభ, పర్మిషన్లపై మాట్లాడే స్థాయా నీది? అని ప్రశ్నించారు. అన్ని అనుమతులతోనే వరంగల్ జిల్లాలో ఇప్పటికే ప్రపంచం, జాతీయ స్థాయి నాయకులు అబ్బురపడేలా సభలు నిర్వహించామన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించడంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపిన నాయకుడు అన్నారు. గాంధేయ మార్గంలో తెలంగాణను సాధించి అంబేద్కర్, పూలే ఆలోచనల మేరకు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టారన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కేటీఆర్ ఐటీకి అంబాసిడర్‌గా నిలిచారని, ఇంకోసారి వారిని విమర్శిస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఇంకా ఎక్కువ మాట్లాడితే నీ బాగోతాలు బయటపెడతామన్నారు. కేసీఆర్ 25 ఏండ్ల క్రితం ఉద్యమం మొదలుపెట్టినప్పుడు నువ్వు ఎక్కడున్నావని ప్రశ్నించారు. బతుకుదెరువు కోసం వచ్చి ఎన్ని బాగోతాలు ఆడావో తమకు తెలుసన్నారు. నీ పదవీ కాలం ఇప్పటికే ఏడాదిన్నర గడిచిపోయిందని, మరో రెండు, మూడేండ్లలో మొత్తం అయిపోతుందని ఎద్దేవా చేశారు. మా సభల జోలికి వస్తే ఉరుకునేది లేదని వినయ్ భాస్కర్ హెచ్చరించారు. సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్, నయీముద్దీన్, కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

### బాలకాలిలో కడియం

ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాలకాలిలో పడ్డాడు. 15 రోజుల నుంచి సోయి తప్పి మాట్లాడుతున్నాడు. దేవునూరు భూములను కబ్జా చేస్తున్నప్పటికీ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఏమీ మాట్లాడకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంది. అంటే కడియం శ్రీహరి, మంత్రి సురేఖ కుమ్మక్కయ్యారనిపిస్తున్నది. ప్రజలను పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రెస్‌మీట్‌లో కేటీఆర్‌పై మాట్లాడుతూ అతి చిన్న వయస్సులో కేటీఆర్ పెద్ద అబద్ధాలు ఆడుతున్నాడని అన్నాడు. మరి నువ్వు చిన్నగా ఉండి కేటీఆర్‌పై మాట్లాడుతున్నావు. నీ స్థాయికి మించి మాట్లాడుతున్నావు. ఇదే రకంగా మాట్లాడితే అతని మీద మా కార్యాచరణ ప్రకటించి బుద్ధి చెబుతాం. కడియం శ్రీహరికి నీతి నిజాయితీ ఉంటే సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వకముందే రాజీనామా చేయాలి.

– నన్నపునేని నరేందర్, మాజీ ఎమ్మెల్యే

### కడియంకు రాజకీయ పునర్జన్మనిచ్చింది కేసీఆర్

చచ్చిన పాములాగా ఉన్న కడియం శ్రీహరికి ఊపిరినిచ్చి రాజకీయ పునర్జన్మనిచ్చింది కేసీఆర్. స్టేషన్‌ఘన్‌పూర్ పేరు చెప్పి 30 ఏళ్ల నుంచి రాజకీయ పబ్బం గడుపుతున్న శ్రీహరి గులాబీ కండువా, పల్లా రాజేశ్వర్‌రెడ్డి దయ, కార్యకర్తల కృషితో గెలిచినవ్. పల్లా రాజేశ్వర్‌రెడ్డి భిక్షతో డిప్యూటీ సీఎం అయినవ్. కేసీఆర్‌ను బ్లాక్‌మెయిల్ చేసి పార్టీ ఫండ్ తీసుకొని రూ. 100 కోట్లకు అమ్ముడు పోయినవ్. దేవునూరు గుట్టలను చెరబడుతున్నావు. బినామి పేర్లతో భూములు కొన్నావు. ఫిరాయింపుల చట్టంపై అవగాహన లేని వ్యక్తి కడియం. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజక వర్గానికి, దేవాదులకు నువ్వు చేసిందేమీలేదు.

– తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే



విరాళం అందిస్తున్న సంఘం సభ్యులు

### సభకు 'త్రిచక్ర' విరాళం రూ. 1,00,116

బీఆర్ఎస్ సభకు హనుమకొండలోని త్రిచక్ర పొదుపు సంఘం రూ. 1,00,116 విరాళం ప్రకటించింది. శనివారం బీఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌కు చెక్కును అందజేశారు. 27న సభకు 800 ఆటోలతో స్వచ్ఛందంగా రావడంతో పాటు ప్రజలను తరలిస్తామని సంఘం అధ్యక్షుడు ఇసంపల్లి సంజీవ తెలిపారు. ఆటో కార్మికులకు కేసీఆర్ అండగా నిలిచారని, రోడ్‌ట్యాక్స్ మాఫీ చేశారన్నారు. హనుమకొండ జిల్లాలో ఆటో కార్మికులకు బీమా సౌకర్యం కల్పించిన ఘనత దాస్యంకే దక్కుతుందన్నారు. త్రిచక్ర సంఘానికి సైతం వినయ్‌భాస్కర్ రూ.30 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మంద శ్రీధర్‌రెడ్డి, చీకటి కుమార్, మడికొండ బాబు, కలకోట్ల జయరాం, స్వామి, సంజీవ, బాబు, వెంకటేశ్వర్లు, రమేశ్ పాల్గొన్నారు.

# రజతోత్సవాన్ని విజయవంతం చేయాలి

- మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతారావు



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కెప్టెన్ లక్ష్మీకాంతారావు

ఎల్కతుర్తి, ఏప్రిల్ 12 : ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ వీ లక్ష్మీకాంతారావు పిలుపునిచ్చారు. ఎల్కతుర్తి సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. అక్కడ చేపడుతున్న పనులు, పార్కింగ్ తదితర అంశాలపై స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ నేతగా తెలంగాణను సాధించిన కేసీఆర్ తొలి సీఎంగా బాధ్యతలు చేపట్టి పదేండ్లలో రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. కేసీఆర్‌కు ఉన్న దూరదృష్టి, తెలంగాణపై మమకారం ఇతర పార్టీల నేతలకు లేదన్నారు. ఉద్యమకాలం నాటి చైతన్యం మళ్లీ ప్రజల్లో రావాలని, అందుకోసం లక్షలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పిట్టల మహేందర్, నాయకులు తంగెడ మహేందర్, ఎల్తూరి స్వామి, పోరెడ్డి రవీందర్‌రెడ్డి, గొల్లె మహేందర్, కడారి రాజు, కుర్ర సాంబమూర్తి, జూపాక జడ్సన్, కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, వేముల సమ్మయ్య, చిట్టిగౌడ్, రాజుకుమార్ ఉన్నారు.

**సభ ఏర్పాట్ల పరిశీలన**

ఎల్కతుర్తిలో జరుగుతున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం తదితరులు పరిశీలించారు.

# రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

రేగొండ, ఏప్రిల్ 12 : మళ్లీ బీఆర్ఎస్ సర్కారు రావడం ఖాయమని, అందుకు ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ సభ నాందిగా నిలుస్తుందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని రూపిరెడ్డిపల్లి, దమ్మన్నపేట, రాయపల్లి, కనిపర్తి, నాగుర్లపల్లి, రేపాక, మడ్తపల్లి, పొనగల్లు గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు అంకం రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో గండ్ర పాల్గొన్నారు. ఆయా గ్రామాలకు ఆయన బైక్‌ర్యాలీగా తరలివెళ్లిన అనంతరం మాట్లాడుతూ ప్రజలంతా కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారన్నారు. ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలో లేని ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఈ నెల 27న జరిగే మహాసభకు పెద్ద ఎత్తున ప్రజలు, శ్రేణులను తరలించి విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశాల్లో నాయకులు ఇంగె మహేందర్, కుందూరు విద్యాసాగర్‌రెడ్డి, పగడాల ఐలయ్య, సామాల పాపిరెడ్డి, బండి రమేశ్, కోలెపాక భిక్షపతి, మాదాటి కరుణాకర్‌రెడ్డి, గంపల లింగయ్య, గోగుల చంద్రారెడ్డి, గుర్రం తిరుపతి, బండి భద్రయ్య పాల్గొన్నారు.

# అంబేద్కర్ అందరివాడు

- కుట్రలతోనే ఒక్క వర్గానికి పరిమితం చేస్తున్నరు
- అన్నివర్గాలకు హక్కులు కల్పించిన చరిత్ర ఆయనది..
- భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశాల్లో చేర్పించాలి
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- సూరారంలో అంబేద్కర్ విగ్రహం, కాటారంలో భారత రాజ్యాంగ స్తూపం ఆవిష్కరణ



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

మహదేవపూర్(కాటారం), ఏప్రిల్ 12 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందరివాడని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కాటారం మండలం సూరారం గ్రామంలో మాజీ సర్పంచ్ నాగుల లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం, కాటారం మండల కేంద్రంలో పుట్టలింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ స్తూపాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, భూపాలపల్లి మాజీ జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణీరాకేశ్ స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. ఆనాడు భారత రాజ్యాంగాన్ని రాసింది అంబేద్కర్ అని చెప్పిన తర్వాత కూడా ఆయనను ఒక్క సామాజిక వర్గానికే అంటగట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎస్సీల రిజర్వేషన్ల కోసం పోరాటం చేసిండని అంబేద్కర్‌ను ఎస్సీలకే పరిమితం చేయాలని చూడడం కుట్రల ఫలితమేనన్నారు. దేశంలోనే ఎక్కువ విగ్రహాలు అంబేద్కర్‌వే ఉన్నాయని, ఎన్ని కుట్రలు చేసినా ఆ మహనీయుడి విగ్రహాల ఏర్పాటును ఆపలేకపోతున్నారని అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరేలా రచించారని, కేవలం ఎస్సీలకు మాత్రమే మేలు చేస్తే బీసీ రిజర్వేషన్లు ఎలా సాధ్యమయ్యాయని, ఈనాడు 42శాతం రిజర్వేషన్లు అడిగే హక్కు ఎక్కడి నుంచి వచ్చిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్నా భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశాల్లో ఎందుకు చేర్చలేదన్నారు. విద్యార్థి దశలోనే రాజ్యాంగం గురించి తెలిసి ఉంటే మన హక్కులు తెలుస్తాయని, ప్రశ్నించే తత్వం వస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు భారత రాజ్యాంగాన్ని అన్ని భాషల్లో ఒక సబ్జెక్ట్‌గా చేర్చాలని డిమాండ్ చేశారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని అందించడమే కాకుండా ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందిన అంబేద్కర్ ను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అన్నారు. అంబేద్కర్ అంటే అందరివాడని ఆలోచన వచ్చే విధంగా లక్ష్మీరెడ్డి తన సొంత ఖర్చుతో ప్రధాన కూడలిలో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమని అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ రావు, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కేదారి గీతాబాయి, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు అలీంఖాన్, నాయకులు ప్రకాశ్, సీనియర్ బాపురావు, వెన్నంపల్లి మహేశ్, ఆల్‌ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ లింగాల రామయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిట్‌లో విద్యార్థుల ఆందోళన

**సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**



నిట్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 12 : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లో విద్యార్థులు శనివారం ఆందోళనకు దిగారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించి నిట్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. అధికారుల ఒత్తిడి కారణంగా విద్యార్థులు మనోవేదన గురై ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండురోజుల క్రితం హైదరాబాద్‌కు చెందిన బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి రితిక్‌సాయి వడ్డేపల్లి చెరువులో పడి ఆత్మహత్య చేసుకోగా శనివారం నిట్ క్యాంపస్‌లో అతడికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. నిట్ అధికారుల ఒత్తిడి కారణంగానే విద్యార్థి చనిపోయారని ఆరోపిస్తూ నిట్ ప్రధాన ద్వారం వద్ద సుమారు 200 మంది విద్యార్థులు నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న కాజీపేట పోలీసులు చేరుకొని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. విద్యార్థులకు బయోమెట్రిక్ విధానాన్ని తొలగించాలని, స్టూడెంట్స్ క్లబ్‌లో పాల్గొనేందుకు 6.5శాతం కాన్కేవ్ గ్రేవ్ పాయింట్(సీజీపీ) ఉండాలని, మెస్‌లో నాణ్యమైన ఫుడ్ పెట్టాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఇన్‌చార్జి డైరెక్టర్ ఉమామహేశ్, రిజిస్ట్రార్ సునీల్‌కుమార్ మెహరా, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ విద్యార్థులతో చర్చలు జరిపారు. అయినప్పటికీ నిట్ అధికారులు విద్యార్థుల డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇవ్వకపోవడంతో విద్యార్థులు సుమారు గంటకుపైగా ఆందోళన కొనసాగించారు.

